


# అతిథి

శాంతి ప్రభాకర్

సాయంసంధ్యా సమయం. శరదృతువు శీతల పవనాలు ప్రకృతికి వింజామర వీస్తున్నాయి. అస్తమిస్తున్న సూర్యుడు పగడపు మణిలా మెరుస్తున్నాడు. సంధ్యారాగం కుసుమ పరాగంలా నాట్యం చేస్తోంది. ఆ సాయం సంధ్యా మనోహర డోలికలో నా హృదయం దూది పింజెలా తేలిపోతోంది. నా

**ముద్దుల కూతురు, ఆమె స్నేహితులు వచ్చే సమయం. వారి కోసం ఆతృతగా నిరీక్షిస్తూ జాజి పందిరి కింద తిన్నెపై కూర్చున్నా.**

మాధవి నా ఏకైక బిడ్డ. అపరంజి బొమ్మలా వుంటుంది. హైదరాబాద్‌లో ఎం.ఏ. తెలుగు భాష ప్రధానాంశంగా చదువుతోంది.

***

మాధవి ఇంటికి రెండు నెలల క్రితం వచ్చింది. మళ్ళీ ఈరోజు వస్తోంది. వాళ్ళ నాన్నగారికి బెంగ లేదు కాని నాకు బెంగగానే వుంది ఈ కాలవ్యవధికి. అరవై రోజుల తర్వాత నా తల్లిని చూస్తాను, అందులోనూ తన ప్రియమైన స్నేహితులతో. మళ్ళీ వాళ్ళు రెండు మూడు రోజులలో వెళ్ళిపోతారట. మా గ్రామం, పరిసరాలు చూడాలని వస్తున్నారు, మాధవి స్నేహితులు.

వాళ్ళందరినీ చాలా జాగ్రత్తగా చూడాలి. లేకపోతే మాధవికి కోపం వస్తుంది. వాళ్ళ నాన్నగారు ఏమీ పట్టించుకోరు. ''అన్ని విషయాలు నువ్వే చూసుకో పూర్ణా. నేను ఏం కలుగచేసుకోను. అంతా నీ యిష్టం, నీ కూతురిష్టం'' అని చెప్పి తెలివిగా తప్పించుకున్నారు. తన పని మీద జారుకున్నారు.... మర్యాద ఎలా దక్కుతుందో – నా మనస్సు పరిపరివిధాలా ఆలోచిస్తోంది.

ఇంతలో కారు గేటుముందర ఆగిన ధ్వని. నేను వెళ్ళి చూసేలోపల బిలబిలలాడుతూ మాధవి, దాని నలుగురు స్నేహితులూ తుళ్ళుతూ, కేరింతలు కొడుతూ ఆవరణలోకి వచ్చేశారు.

''అమ్మా! నా స్నేహితులు – కావేరి, జ్యోత్స్న, రమ, శ్వేత''. ఒక గుక్కలో చెప్పేసింది మాధవి.

''మా అమ్మ!'' అంటూ నన్ను పరిచయం చేసింది.

***

గోరువెచ్చని నీళ్ళతో కాళ్ళు, చేతులు కడుక్కొని మాధవి, ఆమె స్నేహితులు జాజి పందిరి కింద కూర్చున్నారు. కుర్చీలలో కంటె ఇక్కడ బావుందని. చీకటిపడింది. తూర్పు దిక్కు నుండి వెన్నెల వెలుగు శోభాయమానంగా చెట్ల ఆకుల సందుల నుండి దోబూచులాడుతోంది.

''ఆంటీ! ఈ సాయంకాలం ఎంత మనోహరంగా వుంది మీ ఊర్లో!'' కావేరి తన్మయురాలై, సాయంశోభను అనుభవిస్తూ అంది.

అందరూ వేడివేడి పాలు తాగుతున్నారు. వాళ్ళ ముఖ కవళికలు చూస్తుంటే నాకు అనిర్వచనీయమైన ఆనందం కలుగుతోంది.

''మా నగరాలలో ఈ సాయంశోభ, మృదు పవనాలు, ప్రకృతికాంత శీతల స్పర్శ – ఇవేవీ వుండవు కదా! వున్నా వాటికి మేము చాలా దూరంగా వుంటాం కదా! ఏవో రాతి భవనాలలో'' అంది శ్వేత.

''ఇంక కవిత్వం కట్టిపెట్టండి. హాయిగా ఆరు వెన్నెలలో దాబా మీద కూర్చుని చింతపిక్కలాడుకొందాం. మా అమ్మ భోజన సమయానికి పిలుస్తుంది. అప్పటివరకూ, లెండి'' అంటూ వాళ్ళని తీసుకొని మేడమీదికి వెళ్ళిపోయింది మాధురి.

నేను వాళ్ళవైపే చూస్తూ వుండిపోయాను.

***

రెండు రోజులు పిల్లల ఆనందోత్సాహాల మధ్య రెండు క్షణాలలో గడచిపోయాయి. నా అతిథుల ఆదర సత్కారాలతో తలమునకలయ్యా. మావారు నవ్వుతూ ''అతిథి సత్కారాలు చేయడంలో నిన్ను మించినవారు లేరు. ఆ సాంప్రదాయానికి నోబుల్ పురస్కారం వుంటే నిన్నే వరిస్తుంది సుమా!'' అని హాస్యం కూడా చేశారు.

పిల్లలు ఆంటీ అనడం మొదటిరోజే మానివేశారు. 'పిన్నీ' అని నోరారా పిలుస్తున్నారు. నేను కూడా వాళ్ళని ఏకవచనంతోనే పిలుస్తున్నా. వాళ్ళ ఆటపాటల మధ్య ఏమాత్రం విరామం దొరికినా పరుగెత్తుకొని నా దగ్గరకు వచ్చి ఏదో ఒక విషయం చెబుతూనే వుంటున్నారు. నా అతిథుల రాకతో నాకు చాలా తృప్తిగా, సంతోషంగా వుంది. ఇంక రేపే వాళ్ళ తిరుగు ప్రయాణం. ''ఇంకొక రెండు రోజులు నా దగ్గర వుండకూడదూ'' అంటే ''పిన్నీ! నీ దగ్గర మాకూ వుండాలనే వుంది. కాని ఇంటి దగ్గర అమ్మ, నాన్నలు బెంగపెట్టుకుంటారు గదా! నువ్వు చూస్తున్నావు కదా! రోజుకి ఎన్ని ఫోన్లు వస్తున్నాయో!'' అని నా బుగ్గల మీద ముద్దులు కురిపిస్తూ మురిపాలు పోతున్నారు.

వాళ్ళు వెళ్ళిపోయే సమయం సమీపిస్తున్న కొద్దీ నా మనసు ఏదో అనిర్వచనీయమైన ఆందోళనకు గురిఅవుతోంది. ''అవును. వాళ్ళు అతిథులు కదా? ఎన్నిరోజులు నా దగ్గర వుంటారు? నాకు వాళ్ళను సంరక్షించే శక్తి సామర్థ్యాలూ, మనసూ ఆ భగవంతుడిచ్చినా వాళ్ళు తిరిగి తమ స్వజనం దగ్గరికి, స్వంత వూరికి వెళ్ళిపోవాలి కదా!'' అనుకొంటూ నన్ను నేనే సమాధానపరుచుకున్నా.


***

పిల్లలు కారులో వాళ్ళ ఆఖరి కార్యక్రమం పూర్తిచేసుకొని వచ్చేశారు. కారు దిగి అందరూ ఇంట్లోకి వచ్చారు.

''అమ్మా! మేం ఏం తెచ్చామో చెప్పుకో చూద్దాం'' అంది మా అమ్మాయి, రెండు చేతులూ వెనక్కి దాచిపెట్టి.

నేను నవ్వుతూ ''చెప్పలేనమ్మా! నన్ను ఇరకాటంలో పెడుతోంది ఈ మాధవి. చూడండి తల్లులూ. మీరైనా చెప్పండి'' అన్నాను వాళ్ళని దగ్గరకు తీసుకుంటూ.

''పిన్నీ! మేం చిన్న పెలికాన్ పక్షిని తీసుకొని వచ్చాం, నీకు బహుమతిగా ఇద్దామని. మేం వెళ్ళినది తేలినీలాపురం గదా? ఆ పక్షుల విడిది కేంద్రం చూద్దామని వెళ్ళాం. వచ్చేటప్పుడు ఎవరో వ్యక్తి దీనిని అమ్ముతుంటే కొని నీకోసం పట్టుకొని వచ్చాం. చూడు ఎంత ముద్దు వస్తోందో!'' శ్వేత ఒక గుక్కలో చెప్పింది.





## ముద్దుల స్పెషలిస్ట్

**బాలీవుడ్** సెక్సీ నటుడు ఇమ్రాన్ హష్మి ముద్దుల స్పెషలిస్ట్. చాలా సినిమాల్లో ముద్దు సీన్స్‌లో నటించి రికార్డ్ సృష్టించాడు. 'మర్డర్, జహీర్, తుమ్‌సా నహీ దేఖా' సినిమాల్లో సెక్సీగా నటించాడు. మల్లికా షెరావత్‌తో ఎక్కువ ముద్దుసీన్లలో నటించాడు. "మిగతా అన్ని సీన్స్ లాగానే ముద్దు సీన్ కూడా! నాకు ప్రత్యేకంగా ఏమీ అనిపించదు. కాకపోతే ఆ ముద్దును బాగా ఎంజాయ్ చేస్తున్నట్టు ఫేస్ పెట్టాలి. లేకపోతే వికారంగా వుంటుంది'' అంటాడు హష్మి.

నేను నిశ్చేష్టురాలనయ్యాను.

మాధవి చిన్న పంజరాన్ని నా చేతుల్లో పెట్టింది. అందులో ఒకటి రెండు రోజుల వయస్సున్న చిన్న పెలికాన్ పక్షి.

నా మస్తిష్కం మొద్దుబారిపోయింది. నాలోని ఉత్సాహమంతా అణగారిపోయింది. శరీరం శక్తివిహీనమైంది. పిల్లలు నా మానసిక పరిస్థితిని గమనించలేదు. వాళ్ళ తిరుగు ప్రయాణపు సన్నాహాలలో వున్నారు. కాలం ఎలా గడిచిందో నాకు తెలియలేదు. అచేతనావస్థలోనే వాళ్ళ పనులు చక్కబెట్టానేమో! నా అతిథులు నా నుంచి ఎప్పుడు వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయారో కూడా నేను గమనించలేదు. వాళ్ళతోపాటూ మా అమ్మాయి కూడా.

నేను అచేతనావస్థలో మంచంమీద కూర్చుండిపోయాను. నా పక్కనే చిన్న పంజరంలో నా కొత్త అతిథి.

మరుసటిరోజు తెల్లవారింది. రాత్రంతా ఆలోచనలలో మునిగిపోయిన నాకు నా కొత్త అతిథి ఎడల పూర్తిగా నా బాధ్యత అర్థమయింది. పంజరంలో వున్న పక్షిని ఒకసారి చూశాను. పంజరాన్ని మా పెరడులో వున్న మామిడి చెట్టుకు జాగ్రత్తగా చిన్న తాడుతో కట్టాను. పెలికాన్ పక్షికి శశి అని పేరు పెట్టాను కూడా.

మావారు నిద్రలేచిన వెంటనే మొత్తం విషయం చెప్పా.

''పూర్ణా! ఈ కొంగజాతి పక్షులు కొన్ని వేల మైళ్ళ దూరం నుంచి పయనించి సైబీరియా నుంచి మన తేలినీలాపురం వస్తాయి. సైబీరియాలో ఈ ఋతువు చాలా శీతలంగా వుంటుంది. వేలకొలది పక్షులు వలసపోయి తమకు నివాసానికి అనువైన ప్రదేశం వెతుక్కుని ఆ ఉష్ణప్రదేశంలో ఆహారం సంపాదించుకుంటూ, చెట్లపై తాము నిర్మించుకున్న గూళ్ళలో జీవిస్తాయి. తమ జాతిని వృద్ధి చేసుకుంటాయి. తిరిగి అనుకూల వాతావరణ పరిస్థితులు తమ మాతృభూమిలో నెలకొన్నప్పుడు అక్కడికి వెళ్ళిపోతాయి'' అని క్లుప్తంగా చెప్పారు మా ఆయన. ''అయినా నువ్వు ఈ చిన్నపక్షిని ఏం చూసుకోగలవు? ఎవరికైనా ఇచ్చేయ్'' అన్నారు. నేను మౌనం వహించా.

***

రోజులు గడుస్తున్నాయి. శశి నా దగ్గరకు నవంబర్ మాసంలో వచ్చింది. వాళ్ళనీ, వీళ్ళనూ అడిగి మొదటిరోజు నుంచే దానికి అది తినే ఆహారం పెడుతున్నా. శశి కొద్దికొద్దిగా ఎదుగుతోంది. దాని శరీర ఛాయ తెల్లని తెలుపు. చిన్నచిన్న రెక్కలు టపటపలాడిస్తోంది. స్వేచ్ఛగా గాలిలో విహరించాలని దాని కోరిక. చిన్నచిన్న ఆహారపు ముక్కలు తింటోంది. దానికి దవడల వద్ద సంచులు తయారవుతున్నాయి. అంటే అది మగపక్షి అన్నమాట. నాకు తెలిసిన పరిమిత జ్ఞానంలో దాని గురించి అన్ని విషయాలు గమనిస్తున్నా. పంజరంలో శశి అసహనంగా కదులుతూ వుంటే నా హృదయం ద్రవిస్తోంది. అది సహజప్రేమకు దూరమైంది కదా!

రోజులు భారంగా గడుస్తున్నాయి. ''శశిని బయటకు వదిలేస్తే, ఎవరి చేతిలోనైనా పడితే! అమ్మో! దాని ప్రాణం నిలుస్తుందా? ఇంకా రెక్కలు విప్పుకోవడం కూడా రాదే! స్వజాతికి దూరమైపోయిన ఆ చిన్నప్రాణిని రక్షించడం నా బాధ్యత. ఎలాగైనా దాన్ని దాని ఆత్మీయుల దగ్గరకు చేర్చాలి. శశి నా అతిథి కదా!'' అని రోజూ మావారితో అంటూ వుంటాను. అంతా నీ పిచ్చి, భ్రమ అని ఆయన అన్నా నేను నిరుత్సాహపడడం లేదు.

***

వాల్మీకి ఋషిపుంగవుని కలచివేసిన క్రౌంచం, క్రౌంచిల విషాద గాథ నాకు స్ఫురణకు వచ్చినప్పుడల్లా నా హృదయం తల్లడిల్లిపోతోంది. నా శరీరం గాలివానకు గురియైన చిగురుటాకులా కంపిస్తోంది. 'నా శశికి' అటువంటి దుర్గతి పట్టకుండా చూడవలసిన బాధ్యత నాదే కదా! నేను దానిని సమీపించినప్పుడల్లా ఏవేవో శబ్దాలతో నాతో మాట్లాడుతోందా అనిపిస్తోంది. అవి వేదనా భరిత సంజ్ఞలా?

***

హేమంత, శిశిర ఋతువులు గడిచిపోయాయి. వసంత ఋతువు ప్రవేశించింది. ఆనెలలోనే సైబీరియా నుండి తేలినీలాపురం వలస వచ్చిన విహంగాలు తిరిగి తమ పిల్లాపాపలతో మాతృభూమికి వెళ్ళిపోతాయి. శశి బాల్యదశ నుంచి బయటకు వస్తోంది.

నేను ఎదురుచూసిన రోజు వచ్చింది. సాయంకాలం మా ఆయనతో కలిసి తేలినీలాపురం చేరాను. నా చేతిలో చిన్న పంజరం. అందులో శశి.

సాయంసంధ్య సమీపించింది. చెట్లమీద నుండి రెక్కలాడిస్తూ, గిరికీలు కొడుతూ, స్వేచ్ఛగా బారులుతీరి, కిలకిలారావాలు చేస్తూ విహంగాలు వినీలాకాశంలోకి దూసుకుపోతున్నాయి. చల్లని, మృదువైన పవనాలు. ప్రకృతి రమణీయంగా వుంది. నేను ఒక చెట్టు దగ్గర నిలబడి పంజరం తలుపు తెరిచాను. అందులోనుండి నా అతిథి బయటకు వచ్చింది. పరిసరాలు ఒక్కక్షణం పరికించింది. దానికి తన తల్లిదండ్రుల బంధుమిత్రుల జాడ తెలిసిందేమో! ఒక్కసారి తల ఎత్తి నావైపు చూసింది. తన మృదువైన రెక్కలతో నా పాదాలు స్పృశించింది. ఆకాశంలోకి రివ్వున ఎగిరి బారులుతీరి దూసుకుపోతున్న విహంగాలలో కలిసిపోయింది. ''జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపి గరియసీ...'' రామాయణ కావ్యంలోని శ్లోకం అప్రయత్నంగా నా పెదవులపైనుండి బయటకు వచ్చింది. దుఃఖమూ, ప్రేమ మిళితమైన స్వరంతో నా హృదయం అనిర్వచనీయమైన ఆనందం, సంతృప్తితో నిండిపోయింది.

★